

చిన్నారుల కిడ్నాప్ కలకలం



జిల్లాలో చిన్నపిల్లల వరుస కిడ్నాపులు కలకలం సృష్టిస్తున్నాయి. వారం రోజులుగా నగరంలో ఏదో ఒక చోట చిన్నారుల అపహరణలు బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. ఒంటరిగా పిల్లలను బయటికి పంపేందుకు జంకుతున్నారు. ఓ వర్గానికి చెందిన కిడ్నాపర్ల ముఠా జిల్లా వ్యాప్తంగా సంచరిస్తుందనే ఆరోపణలు వినవస్తున్నాయి. కాగా, చిన్నారుల కిడ్నాప్ అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఇతర జిల్లాలో ఉన్న బంధువులు ఆరాతీస్తున్నారు. 'పిల్లలు జాగ్రత్త' అంటూ ధైర్యం చెబుతున్నారు.

- జిల్లాలో వరుస కిడ్నాప్‌లు
- వారం రోజుల్లో ఆరు ఘటనలు
- భయాందోళనలో ప్రజలు
- చిన్నారులే టార్గెట్‌గా కిడ్నాపర్ల సంచారం
- ఇంత జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్న పోలీసు శాఖ

ఖిల్లా,ఫిబ్రవరి 7: చిన్నారుల అక్రమ రవాణాకు ఇందూరు కేంద్ర బిందువుగా మారింది. వయసుతో ప్రమేయం లేకుండా పిల్లలను కిడ్నాప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయలకు అమ్ముకుంటున్నారు. వరుసగా జరుగుతున్న చిన్న పిల్లల కిడ్నాప్‌లతో జిల్లా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఒంటరిగా పిల్లలను పంపడానికి జంకుతున్నారు. వారం రోజుల్లోనే వరుసగా నాలుగు నుంచి ఆరు ఘటనలు జరగడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను కిడ్నాప్ చేయడానికి జిల్లా కేంద్రంలో ఒక వర్గానికి చెందిన కిడ్నాపర్ల ముఠా జిల్లా వ్యాప్తంగా సంచరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి వారికి మాయ మాటలు చెప్పి వారికి నయానో బయానో ముట్టచెప్పి కిడ్నాపర్లు మాత్రం లక్షల్లో సంపాదిస్తున్నారు.

అపహరించి.. హైదరాబాద్‌కు తరలించి

గత నెల 30న జిల్లా కేంద్రంలోని మాలపల్లి ప్రాంతానికి చెందిన మినాహాజ్ అనే ఏడేళ్ల వయస్సు ఉన్న బాలుడి ఇంటి పక్కనే నివాసం ఉంటున్న సోహెల్‌ఖాన్ కిడ్నాప్ చేసి హైదరాబాద్‌కు తరలించాడు. అంతకు ముందు ఆ పిల్లాడితో చనువుగా ఉంటూ పిల్లవాడిని మార్కెట్‌కు తీసుకెళ్లడం.. పిల్లాడికి కావాల్సినవి ఇప్పించడం చేశాడు. పూర్తిగా పిల్లవాడు నమ్మడంతో అతని వెనక ఉన్న ముఠా సభ్యులకు సమాచారం ఇచ్చాడు. పిల్లాడిని గత నెల30న రాత్రి సమయంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల వద్ద గల నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఇన్నోవా కారుతో ఉన్న ఇద్దరు మహిళలకు పిల్లవాడిని అప్పగించి అదే కారులో వారితో ధర్మారం వద్ద గల చీకటి ప్రాంతంలో కారు దిగి నగరానికి చేరుకున్నాడు. పిల్లవాడి కుటుంబసభ్యులు పిల్లాడి కోసం గాలిస్తుండగా తాను సైతం వారితో కలిసి పక్క వీధిలో ఉన్న సీసీ ఫుటేజీలను వారికి చూపిస్తూ వారిని తప్పుదోవ పట్టించాడు. రెండు రోజుల తర్వాత పిల్లాడి డబ్బుల కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ డబ్బులు తీసుకుని ఓ లాడ్జ్‌లో ఉండగా పోలీసులు సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా పట్టుకున్నారు. అదే విధంగా రూరల్ మండలంలోని బైపాస్ వద్ద సోమవారం చిన్నారిని కిడ్నాప్ చేసిన ఘటన జరిగింది. కామారెడ్డి జిల్లా బిక్కనూర్‌లో సైతం పిల్లాడిని కిడ్నాప్ చేసిన ఘటన జరిగింది.

ఉమ్మడి జిల్లాలో ముఠా సంచారం

ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులతో జిల్లాకు చెందిన కొందరు ముఠాగా ఏర్పడి పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారు. కొంత కాలంగా ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కిడ్నాప్‌లకు పాల్పడుతున్నా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న నిఘా విభాగం వీటిపై దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శివారు ప్రాంతాల్లో కిడ్నాపర్లు యథేచ్ఛగా సంచరిస్తున్నా నిఘా వ్యవస్థ దృష్టి సారించకపోవడంతో వారి పనులు సులభంగా జరుగుతున్నాయి. కొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించినా మిస్సింగ్ కేసుగా నమోదు చేస్తున్నారే తప్ప.. వారి కోసం గాలిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

• బాలుడిని తల్లికి అప్పగిస్తున్న రూరల్ పోలీసులు

• ఇటీవల పిల్లవాడిని బైక్‌పై తీసుకెళ్తున్న కిడ్నాపర్లు

• నగరంలో కిడ్నాప్‌కు గురైన పిల్లవాడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

అవయవాల కోసమే కిడ్నాపులు!

అవయవాల కోసమే పిల్లలను కిడ్నాప్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.పదేళ్లకు పై బడ్డ పిల్లలను కిడ్నాప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించి కొన్ని రోజులు వారికి శారీరక మార్పుకు సంబంధించిన మందులను ఇచ్చి అనంతరం వారి అవయవాలను ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరి కొందరు కిడ్నాప్ చేసిన పిల్లలను సముద్ర ప్రాంతాలైన కాకినాడ లాంటి ప్రదేశాలకు తరలించి అక్కడి నుంచి ఇతర దేశాలకు షిప్పు మార్గాన అక్రమ రవాణా చేస్తున్నట్లు జిల్లా కేంద్రంలో కొందరు చర్చించుకుంటున్నారు



అపోహలు నమ్మొద్దు..

నగరంలో పిల్లలను కిడ్నాప్ చేసే ఎటువంటి ముఠా రాలేదని, ప్రజలు అపోహలను నమ్మవద్దు. కొత్త వారితో తమ పిల్లలను పంపరాదని, కాలనీల్లో కొత్తవారు సంచరిస్తే డయల్-100కు సమాచారం ఇవ్వాలి. కిడ్నాప్‌లు చేసిన వారిని పోలీసులు పట్టుకున్నారు. ప్రజలు కొత్తవారితో, అనుమానితులతో జాగ్రత్తగా ఉండాలని పోలీసు శాఖకు సహకారం అందించాలని తెలిపారు.

– జయరాం, అదనపు డిప్యూటీ పోలీసు కమిషనర్



బీఆర్ఎస్ ప్రభుత్వం నిజాంషుగర్స్‌ను నిర్వీర్యం చేసింది

- కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యాక్టరీని తిరిగి తెరిచేందుకు సిద్ధంగా ఉంది
- రైతులు మళ్లీ చెరుకు పంట వైపు మొగ్గు చూపాలి
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 7: గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో నిజాంషుగర్ ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు సిద్ధంగా ఉందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బోధన్, ముత్యంపేట, మంబోజిపల్లిల్లో ఉన్న నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరువాలని రైతులు డిమాండ్ చేస్తే కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. 2.75లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిజాంరాజు నిజాంసాగర్ కట్టించారని ఇంజనీర్ల సూచనల మేరకు చెరుకు సాగు ప్రోత్సహించేందుకు నిజాంషుగర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారన్నారు. 16 వేల ఎకరాలకు పైగా ఫ్యాక్టరీ కోసం కేటాయించి ఎంతో మంది కార్మికులకు ఉపాధి ఇచ్చారని కార్మికుల పిల్లల కోసం మదుమలాంచ కళాశాల, ఆస్పత్రులను నిర్మించారన్నారు. ఆసియాలోనే పెద్దదైయిన నిజాంషుగర్స్‌ను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాయంలో 51శాతం ప్రైవేటుకు, 49శాతం ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచేలా ఒప్పందం చేశారని ఆయన అన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే ఫ్యాక్టరిని నడుపుతుందని చెప్పి అధికారంలోకి వచ్చాక ఫ్యాక్టరీని పట్టించుకోకపోవడంతో 2015లో ఫ్యాక్టరీలు మూత పడ్డాయన్నారు. సీఎం.రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు చెరుకుఫ్యాక్టరీని చెరిపించేందుకు కమిటీ వేశారని రైతులు కూడా వరి పంటకు బదులు ప్రత్యామ్నాయంగా చెరుకు పంట సాగు చేయాలన్నారు. కొత్త చెరుకు వంగడాలను తయారు చేయించి ఎకరాకు 50నుంచి 60టన్నుల దిగుబడి వచ్చేలా చేస్తే ఫ్యాక్టరీకి పూర్వవైభవం వస్తుందన్నారు.

ఫ్రూట్ మార్కెట్‌ను పరిశీలించిన సుదర్శన్‌రెడ్డి

జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్‌లో గల ఫ్రూట్ మార్కెట్‌ను ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రాంతాల నుంచి జిల్లాకు ఏఏ రకాల పండ్లు వస్తున్నాయో వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. మన జిల్లాలోనూ పండ్లు పండించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పండ్ల పంట లను పండించేలా రైతులను ప్రోత్సహిస్తే రైతులకు లాభం జరుగుతుందని ఆ దిశగా అధికారులు ప్రయత్నాలు చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, మానాల మోహన్‌రెడ్డి, నగేష్‌రెడ్డి, కేశవేణు, గంగారెడ్డి ఉన్నారు.



ఫ్రూట్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



ఇందల్‌వాయి ఎస్సై మహేష్

ఇందల్‌వాయి ఎస్సైపై కేసు

మహిళను మోసగించిన ఘటనలో.. పనిచేసే స్టేషన్‌లోనే కేసు నమోదు

అజ్ఞాతంలోకి వెళ్లిన ఎస్సై మహేష్

ఇందల్‌వాయి, ఫిబ్రవరి 7: మహిళను మోసగించిన ఘటనలో తాను పనిచేసే పోలీసుస్టేషన్‌లోనే ఎస్సైపై కేసు నమోదైన ఘటన జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇందల్‌వాయి పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా మహేష్ గత ఆరు నెలలుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఓ కేసులో కామారెడ్డి జిల్లాకు చెందిన యువతితో మహేష్‌కు కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. సదరు యువతికి గతంలో పెళ్లి కాగా.. మనస్పర్థల వల్ల భర్తతో వేరుగా జీవిస్తోంది. ఈ క్రమంలో యువతితో ఎస్సైకి ఏర్పడిన పరిచయం కాస్త ఇద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారి తీసింది. అయితే ఇటీవల మహిళ గర్భందాల్చడంతో.. తనను వెంటనే పెళ్లి చేసుకోవాలని ఎస్సై మహేష్‌పై ఒత్తిడి పెంచింది. అప్పటికే మహేష్‌కు పెళ్లి కావడంతో.. ఇందుకు ససేమిరా అన్నాడు. దీంతో కోపోద్రిక్తురాలైన మహిళ.. మహేష్ తనను మోసగించాడంటూ గత ఆదివారం ఇందల్‌వాయి పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. జరిగిన ఘటనపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. విషయం తెలుసుకున్న ఎస్సై మహేష్ సిక్‌లీవ్ పెట్టి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌ను సైతం స్టేషన్‌లోనే వదిలేసి వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం విచారణ జరిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై మహేష్‌పై ఇందల్‌వాయి పోలీసు స్టేషన్‌లోనే కేసు నమోదు చేశారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



నిర్మల సీతారామన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 7: ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. కేంద్రం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీం ద్వారా రాష్ట్రానికి నిధులు ఇస్తే వాటిని రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు విన్నవించారు. అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్రం సరైన విధంగా ఉపయోగించడం లేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో నిర్మల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్ తదితరులు ఉన్నారు.



నిధులు దక్కేనా?

- నేటినుంచి బడ్జెట్ సమావేశాలు
- రాష్ట్ర బడ్జెట్‌పైనే ఉమ్మడి జిల్లా వాసుల ఆశలు
- పెండింగ్ ప్రాజెక్ట్‌లకు నిధులు కేటాయించేనా?
- గత ప్రభుత్వ హయంలో బడ్జెట్‌లో అరకొరగానే కేటాయింపులు
- ప్రజాప్రతినిధులు గళం విప్పాలి.. నిధులు రప్పించాలి

కామారెడ్డి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుంచి నిర్వహించనున్న అసెంబ్లీ సమావేశాలలో రాష్ట్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా రైతులు, ప్రజలు ఆశలు పెట్టుకుంటున్నారు. ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టులకు గత ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడం, నిధుల లేమితో సంవత్సరాల తరబడి ప్రాజెక్టుల పనులు పూర్తికావడం లేదు.

గళం విప్పి నిధులు రాబట్టాలి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. రెండు జిల్లాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి అనేక పెండింగ్ ప్రాజెక్టులు, ప్రజా సమస్యలు అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ప్రజల పక్షాన అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించేందుకు సిద్ధమయ్యారు. నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, రూరల్, ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల ఎమ్మెల్యేలైన ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, భూపతిరెడ్డి, పైడి రాకేశ్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డితో పాటు కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డిలు అసెంబ్లీలో గళం విప్పి నిధులు రాబట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దశాబ్దాలుగా ప్రాజెక్టులకు నిధుల కరువు

ఉమ్మడి జిల్లాలో దశాబ్దకాలంగా సాగునీరు ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించక పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పాటు వైద్య, విద్య పరంగా జిల్లాకు మరిన్ని సదుపాయాలు కల్పించాలని ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు.

జలాశయాలకు నిధులు పారేనా?

ఉమ్మడి జిల్లాలో నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాల లాంటి సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ చాలా ప్రాంతాలకు సాగు, తాగునీరు అందడం లేదు. ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలలో సగానికి పైగా మండలాల్లో సాగునీరు అంద లేక ఆయా ప్రాంతాల రైతులు సంవత్సరంలో ఒకే పంటను సాగు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ప్రధానంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు క్రింద 22వ ప్యాకేజ్ పనులను రీడిజైన్ చేసి గత ప్రభుత్వం చేపట్టింది. కానీ ఈ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు రాకపోవడం జరిగిన పనులు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నత్తనడకన పనులు సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పనులను పూర్తిచేస్తే రైతులకు ఉపయోగపడనుంది. పనులను త్వరితగతిన పూర్తిచేసి కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల రైతులను ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకురానున్నారు.

పేరుకుపోయిన నిజాంసాగర్ పూడిక

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు వరద ప్రదాయినిగా ఉన్న నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడిక తీతకు నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టులో పూడిక పెరుకపోయి సామర్థ్యం తగ్గుతూ వస్తుంది. వంద సంవత్సరాల చరిత్ర ఉన్న పోచారం ప్రాజెక్టు ఎత్తు పెంచుతామని ఆయా కట్టు రైతులకు మరింత సాగునీరు అందించేలా చేస్తామని బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైందే తప్ప.. పనులు మాత్రం జరగలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రాజెక్టుల ఆధునికీకరణకు సరైన నిధులు కేటాయించకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు. ఈ బడ్జెట్‌లోనైన ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు లకు పెద్దపీట వేసి నిధులు కేటాయించి పనులు పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 7: మున్సిపల్ పరిధిలో చేపట్టిన ఆయా పనులలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి ప్రతిపక్ష నాయకుడు వెంకటరమణారెడ్డి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ఫిర్యాదు ఆధారంగా విజిలెన్స్ అధికారులు కామారెడ్డి మున్సిపాలిటిలోని ఆయాశాఖలకు సంబంధించిన వివరాలు సేకరించడంతో పాటు క్షేత్రస్థాయిలో పలుచోట్ల పనులను పరిశీలించిన విచారణ మధ్యలోనే ఆగిపోయింది. అయితే ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పాటుకావడంతో పెండింగ్ ఫైళ్లను మళ్లి పరిశీలనచేస్తున్నట్లు సమాచారం.ఇందులో భాగంగానే కామారెడ్డి మున్సిపాలిటిలో అవినీతి, అక్రమాలకు సంబంధించి మళ్లీ విచారణను మొదలుపెట్టింది. గతనెల 17, 18వ తేదీలలో మున్సిపల్‌లోని నాలుగు విభాగాలకు చెందిన అధికారులు పనులకు సంబంధించిన నివేదికలను అందించాలని కోరడంతో అధికారులు విచారణకు హజరై వారి వద్ద ఉన్న నివేదికలను అందించారు. అయితే బుధవారం ఆ పనులను పరిశీలించేందుకు విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేసి పలు భవనాలు, క్రీడప్రాంగణాలు,పట్టణ ప్రకృతి వనాలు, మున్సిపల్ ఖాళీ స్థలాలు, తదితర అంశాలను పరిశీలించారు. వారు గుర్తించిన అంశాలను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు విజిలెన్స్ అధికారులు పేర్కోన్నారు.


పనులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

'సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి'

మాచారెడ్డి,ఫిబ్రవరి 7:సంత్ సద్గుర్ సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ మండల అధ్యక్షుడు గోపాల్‌కృష్ణ అన్నారు. అనాగరికంగా జీవిస్తున్న బంజారాలను ఆధ్యాత్మిక, విజ్ఞానపరమైన పరిజ్ఞానం సాధించేలా సేవాలాల్ మహరాజ్ కృషి చేశారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించిందని, కానీ సెలవుదినంగా ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అధికారికంగా నిర్వహించడంతో పాటు సెలవుదినంగా ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అంతయ్య, రాజ్‌ఖాన్‌పేట్ ప్రధానోపాధ్యాయుడు దేవిచంద్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.


ఫ్యాక్టరీ ఎదుట కాంగ్రెస్ జెండాలతో నాయకులు

'ఫ్యాక్టరీని కాంగ్రెస్ పునరుద్ధరిస్తుంది'

బోధన్‌రూరల్, ఫిబ్రవరి7: నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుందనే నమ్మకం తమకు ఉందని కార్మిక సంఘం నాయకులు నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ గేట్ ఎదుట బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా ఫ్యాక్టరీని పునరుదరిస్తామని కార్మికులకు, కర్షకులకు మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం కమిటీలు వేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, ఫ్యాక్టరీ పునరుద్ధరణతో యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. అలాగే 2015 లేఆఫ్ నాటి నుంచి రైతులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ముగిసిన సాధు సమ్మేళనం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి7: గత మూడురోజులుగా డిచ్‌పల్లి మండలకేంద్రంలోని ఎస్ఎల్‌జీ గార్డెన్‌లో కొనసాగుతున్న వశిష్ట సంచార శతసత్సంగ మహోత్సవ సంబరాలు సాధు సమ్మేళనం బుధవారం సాయంత్రం ఘనంగా ముగిసాయి. ఆచార్య పరిపూర్ణనందగిరి, విష్ణుసేవనంద స్వామి, శంకరనంద స్వామి, బ్రహ్మశ్రీ తుకారం జగదీశ్వరనంద స్వామి అనంత నందగిరి స్వామి, ఒంకార నంద స్వామి, పురుషోత్తం మహారాజ్, శ్రీరాజరామనంద మహరాజ్, బ్రహ్మనంద మహరాజ్ స్వాములు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషనలు చేశారు. ప్రతీఒక్కరు భగవద్గీత పారాయణం ద్వారా ఏకాగ్రత నెలకొంటుందని, సాధుసమ్మేళనం ద్వార జానయజనం నెలకొంటుందన్నారు. ఇందులో ఎంపీపీ గడ్డె భూమన్న,పార్శి సంధ్యరాణి, రాజేందర్, రాజరాం, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, ఆశోక్, భరత్ భూషన్ హాజరయ్యారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి7: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని టీయూ ఏబీవీపీ నాయకులు కలెక్టర్ కార్యాలయంలోని ఏవోకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ నుంచి రావల్సిన రూ.కోటి బకాయిలను వెంటనే విడుదల చేయించాలని, వర్సిటీ కార్యవర్గ సభ్యులు శివా ఆధ్వర్యంలో విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. వర్సిటీలో మూడు హాస్టళ్లలోనిధులు లేకపోవడంతో అరకొరగా హాస్టళ్లు కొనసాగుతున్నాయని, ఇలాగే కొనసాగితే హాస్టళ్లు మూతబడే అవకాశం ఉందన్నారు. స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవీపేట, ఫిబ్రవరి7: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై యాదగిరిగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని నాడాపూర్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీ నెంబర్లు, ఏటీఎం పిన్ నెంబర్లను చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై గఫర్, పోలీసు సిబ్బంది, స్థానికులు ఉన్నారు.

బాల్యానికి బలం.. పోషకాహారం

● జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో రాగి జావ పంపిణీ ● స్వచ్ఛంధ సంస్థ సహకారంతో వారానికి 3రోజులు పాటు అందజేత


పిల్లలకు రాగి జావా వడ్డిస్తున్న దృశ్యం

కోటగిరి, ఫిబ్రవరి7: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చదువుతోపాటు పోషకాహారాన్ని అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రాగి జావ పంపిణీకి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛంద సంస్థ సహకారంతో కొనసాగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారం అందించే కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

● వారానికి మూడు రోజులు

ప్రస్తుతం వారానికి మూడు రోజులు రాగి జావను అందించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం రాగి పౌడర్, బెల్లం పౌడర్‌ను జిల్లా కేంద్రాలకు సరఫరా చేశారు. అక్కడి నుంచి మండల కేంద్రాలకు, పాఠశాలల మధ్యాహ్నభోజన ఏజెన్సీలకు సరఫరా చేశారు. వారు దాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు.

● జిల్లాలో 1,23,590 మందికి పిల్లలకు..

జిల్లాలో ప్రస్తుతం మొదటి విడతలో 41 ప్రభుత్వ పాఠశాలల్లో 5,029మంది విద్యార్థులకు రాగిజావను అందించారు. గత ఏడు నెలల నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 1,23,590 మంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ప్రతి రోజూ ఉదయం పిల్లలకు రాగిజావ అందిస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో విరామ సమయంలో విద్యార్థులకు రాగి జావను అందిస్తున్నారు.

● పోషకాహార లోపాన్ని అధిగమించేలా..

పోర్టిఫైడ్ రాగి పిండి, బెల్లం మిశ్రమంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. జావ తయారీకి వినియోగించే మిశ్రమంలో రాగి, బెల్లం, సోయా, బియ్యం, దాల్చిన చెక్క, పసుపు, ఉప్పు తదితరవి ఉంటాయి. వాటిని పొడిగా చేసి సాయి ష్యూర్ పేరిట ప్యాకెట్లను పాఠశాలలకు అందిస్తున్నారు. వీటిలో కార్బోహైడ్రేడ్ కాల్షియం, మెగ్నీషియం, వివిధ రకాల విటమిన్లు, ఫైబర్లు, ఐరన్ దాగి ఉన్నాయి. విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపకరించనున్నాయి. రాగి జావ పంపిణీ కార్యక్రమంగా సక్రమంగా కొనసాగిస్తే విద్యార్థుల్లో పోషకాహార లోపం సమస్యను అధిగమించవచ్చు.

సక్రమంగా అమలు చేస్తున్నాం

● నాగనాథ్, ఎంఈవో, కోటగిరి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేస్తున్నాం. మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో 5వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. వారానికి మూడు రోజుల పాటు విద్యార్థులకు రాగిజావ అందిస్తున్నాం. స్వచ్ఛంధ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది.

ప్రజా ఉద్యమకారులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 7: ప్రజా ఉద్యమకారులపై ఖమ్మం సీపీ సునిల్‌దత్ చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికావని, వాటిని వెనక్కి తీసుకోవాలని సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు మల్లేష్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఐఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో ప్రజాపంథా పార్టీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను పోలీసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు. ప్రజా ఉద్యమకారులను రౌడీ షీటర్లు అంటూ సంబోధిస్తూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖమ్మం సీపీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాపంథా నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోధన్ ప్రజా పంథా నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, సీహెచ్ గంగయ్య, బాలయ్య, రాజు, శంకర్, శ్రీను, నాగమణి, తదితరులు ఉన్నారు.

16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె

పెద్దబజార్, ఫిబ్రవరి 7: ఈనెల 16న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణా బీడీవర్కర్స్ సిగార్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుడు గోపాల్స్వామి, నూర్జహాన్ కోరారు. బుధవారం నగరంలోని శివాజీనగర్‌లో గల తెలంగాణా బీడీ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులకు సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ సామాన్య హక్కులపై దాడిచేస్తుందన్నారు. దేశానికి ఆర్థిక వనరులను సమకూర్చే ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడి దారులకు అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపించారు.

కులగణనపై అవగాహన

బోధన్‌రూరల్, ఫిబ్రవరి7: బోధన్ పట్టణంలోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జంగమ కుల గణనపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగమ సమాజ్ కుల సంఘాల నాయకులు పురాణే అజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన సమీక్ష కోసం చర్యలు చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శివకుమార్ అప్ప, నాయకులు సిద్ద లింగప్ప, చంద్రశేఖర్, నర్సింగ్ అప్ప, దిలీప్‌కుమార్, శంకరప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దగ్ధం

కోటగిరి, ఫిబ్రవరి 7: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కోటగిరి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బాల్క సుమన్ తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు షాషెద్, మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్, తదితరులు ఉన్నారు.

గ్రంథాలయ భవన సెంట్రింగ్ తొలగింపు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సెంట్రింగ్‌ను తొలగిస్తున్న దృశ్యం

నవీపేట, ఫిబ్రవరి7: నవీపేట శాఖ గ్రంథాలయం మొదటి అంతస్తులో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణానికి సంబంధించిన స్లాబ్ సెంట్రింగ్‌ను బుధవారం తొలగించారు. జిల్లా గ్రంథాలయ శాఖకు చెందిన రూ.30లక్షలతో నవీపేట గ్రంథాలయం మొదటి అంతస్తులో అదనపు గదుల నిర్మాణం చేపట్టినా దీనికి సంబంధించి స్లాబ్ వేసి రెండున్నర నెలలు గడిచిన సెంట్రింగ్ తొలగించకపోవడంతో ఈనెల 5న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన 'అసంపూర్తిగా గ్రంథాలయం' అనే కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం భవన స్లాబ్‌కు సంబంధించిన సెంట్రింగ్‌ను తొలగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

కోటగిరి, ఫిబ్రవరి7: ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరి కనీస మౌలిక వసతులు కరువై అధ్వానంగా తయారయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. కోటగిరి మండలకేంద్రంలోని పలు ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలను బుధవారం సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు మెరుగుపర్చి ఉపాధ్యాయ పోస్టులతో పాటు నాన్ టీచింగ్ స్టాఫ్, కార్యాలయ సిబ్బంది, నైట్ వాచ్‌మెన్, స్కావెంజర్‌లను నియమించాలన్నారు. గత ప్రభుత్వం సామాన్యుడికి విద్యను దూరం చేస్తూ వ్యాపారం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ స్కూల్‌లలో వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మిర్జాపూర్ పాఠశాల కూలిపోయే దశలో ఉందని, తరగతి గదులు లేక మహిళ సంఘం భవనంలో తరగతులు నిర్వహించే పరిస్థితి లేదన్నారు. పాఠశాల భవనం ముందున్న రేకులు ఊడిపోయి విద్యార్థుల మీద పడే ప్రమాదము ఉన్నందున త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాములు, ఓమయ్య, విఠల్ గౌడ్, గంగాధర్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం

టీహబ్‌కు ప్రతీరోజు 20 శాంపిల్లను పంపించాలి

● డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్

భిక్కనూరు, ఫిబ్రవరి7: భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన టీహబ్ సెంటర్‌కు ప్రతీరోజు తక్కువ శాంపిళ్లు వస్తున్నాయని, ప్రతీరోజు తప్పనిసరిగా 15 నుంచి 20 శాంపిళ్లు పంపాలని జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్ సూచించారు. బుధవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలోని ఓపీ, సిబ్బంది రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్, ల్యాబ్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీహబ్‌లో అన్నిరకాల పరీక్షలు ఉచితంగా చేయ్యడం జరుగుతుందని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో సేకరించిన షాంపిళ్లకు ఇక్కడే పరీక్షలు నిర్వహించి రిజల్ట్‌ను తిరిగి పెషేంట్‌కు అందజేస్తామన్నారు. సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి దేవిహేమిమా, వైద్యుడు ఆదర్ష్, సిబ్బంది రమణ, లతీఫ్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఫిర్యాదుల రిజిస్టర్‌ను ఏర్పాటు చేయాలి

● డీపీవో శ్రీనివాస్‌రావు ● గ్రామంలో పారిశుధ్య పనుల పరిశీలన

భిక్కనూరు, ఫిబ్రవరి7: ప్రతీ గ్రామంలో ఫిర్యాదుల రిజిస్టర్‌ను తప్పకుండా ఏర్పాటు చేయాలని డీపీవో శ్రీనివాస్‌రావు సూచించారు. బుధవారం భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను డీపీవో పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామంలో మురికికాలువలు, రోడ్లను, ప్రభుత్వ సంస్థల పరిసరాలను శభ్రం చేసి ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను, యువకులను బాగస్వాములు చేయాలని, అన్నిగ్రామాల్లో గుట్కా, గంజాయి, డ్రగ్స్ వలన కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు.


జంగంపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో

ఈ నెలాఖరు వరకు ప్రతిగ్రామంలో 100శాతం పన్నులను వసూళ్ల చే యాలని ఆదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సాయి బాబా, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ నర్సింలుయాదవ్, ఉపసర్పంచ్ బాస్కర్‌చారీ, పం చాయతీ కార్యదర్శి బాబు, గ్రామస్థులు ఉన్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి7: ఉపాధిహామీ కూలీల సంఖ్యను పెంచాలని, దానిద్వారా మెటిరియల్ కాంపోనెంట్ లభిస్తుందని జడ్పీచైర్‌పర్సన్ దఫేదర్‌శోభ అన్నారు. బుధవారం జడ్పీ కార్యాలయంలో స్థాయి సంఘ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులతోపాటు వర్షాకాలంలో రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధిహామీ పనులు చేయాలని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, రానున్న వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ప్రణాళికలు తయారు చేయాలని చెప్పారు. ఆయాశాఖల అధికారులు వారి ప్రగతి నివేదికను చదివి వినిపించారు. సమావేశంలో జడ్పీసీఈవో సాయాగౌడ్, జడ్పీటీసీలు హనుమాన్లు, భారతీ, శంకర్‌నాయక్, శ్రీలత ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విక్రయిస్తున్న వేస్టెజ్ మందుల పట్టివేత

రాజంపేట, ఫిబ్రవరి7: మండలంలోని కొండాపూర్ గ్రామంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న వేస్టెజ్ మందులను పట్టుకున్నట్లు ఏవో సుప్రజ్యోతి తెలిపారు. బుధవారం అల్విన్ ఇండస్ట్రిస్ పేరుతో ఉన్న వేస్టెజ్ ప్రాడెక్ట్‌లను ఆటోలలో తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నారని పలువురు రైతులు ఫిర్యాదులు చేయడంతో స్టాక్‌ను పట్టుకున్నట్లు వెల్లడించారు. సదరు ప్రొడెక్ట్‌కు ఎలాంటి లైసెన్స్ లేదని, నిబంధనల ఉల్లంఘన కింద అగ్రిహ్యూమిక్ గ్రానెల్స్ 36 బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజ్‌కుమార్, రమాదేవి, శ్రీశైలం, బుట్టరాజులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు


నడిపల్లిలో పారిశుధ్య పనులను పరిశీలించిన ప్రత్యేకాధికారి

ఇందల్‌వాయి, ఫిబ్రవరి7: మండల కేంద్రంలో ఎంపీడీవో రాములునాయక్ పారిశుధ్య పనులను ప్రారంభించారు. బుధవారం నుంచి ఈనెల 15 వరకు పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తుండడంతో ప్రతీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గ్రామంలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులపై ఉందని సూచించారు. ఈ మేరకు రోజువారి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే వారోత్సవాలు ప్రతి రోజు మురుగుకాలువలు శుభ్రం చేయడం ప్రధాన రహదారులపై చెత్త తొలగింపు కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

● కమ్మర్‌పల్లిలో ప్రారంభమైన పారిశుధ్య వారోత్సవాలు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పరిశుధ్య వారోత్సవాలు మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల అధ్వర్యంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మండలకేంద్రంలోని మండలపరిశత్ కార్యాలయంవద్ద ప్రత్యేక అధికారి ఎంపీడీవో టీ. సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యాలయం చుట్టూ ముల్లపొదలను, చెత్త చెదారాన్ని పంచాయితి పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ పాలెపు గంగారాం, పంచాయితి కార్యదర్శి శాంతికుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండంలోని బషీరాబాద్ లో గ్రామ ప్రత్యేక అధికారి షైలారం గంగాధర్ అధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టారు. మండంలోని అన్ని గ్రామాలలో వారం రోజులపాటు పారిశుధ్య వారోత్సవాలు కొనసాగనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

● జక్రాన్‌పల్లిలో పారిశుధ్య పనులు

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్నిగ్రామాల్లో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. జక్రాన్‌పల్లిలో గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో బ్రహ్మనందం, కొలిప్యాక్‌లో గ్రామప్రత్యేక అధికారి, పశువైద్యాధికారిణి డాక్టర్ శిరీష పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా మురికి, డ్రైనేజీల్లో మురుగును తొలగించారు. రోడ్లపై ఉన్న చెత్తచెదారాన్ని ఊడ్చి, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన ప్రత్యేక అధికారి

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లిపంచాయతీ పరిధిలో చేపట్టిన పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం నడిపల్లి పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులను మండల ప్రత్యేక అధికారి రాజేందర్ ఎంపీడీవో గోపిబాబు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వారోత్సవాలను అన్ని గ్రామాల్లో సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు పారిశుధ్య వారోత్సవాలపై శ్రద్ధ చూలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నిట్టు కిషన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

● పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలి

మోస్రా: మండల కేంద్రంతోపాటు మండలంలోని గోవూర్ గ్రామంలో బాన్సువాడ నియోజకవర్గ ప్రత్యేక అధికారి పీడీ చందర్ నాయక్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రతను పరిశీలించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సరిపోకపోతే బయట కూలీలతో పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు. చెత్త చెదారం లేకుండా గ్రామాలను శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారులు సాయిలు, రఫీ, ఏపీఎం ముఖీమ్, కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, ముతీబ్, కారోబార్ రాము పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో పారిశుధ్య సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతీఒక్కరు కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి నందకుమారి సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, పాత బస్టాండ్ ప్రాంతాలలో మురికి కాలువలను పరిశీలించారు. మురికి కాలువలలో పెద్ద ఎత్తున పూడిక పేరుకు పోవడంతో యంత్రాల సహాయంతో పూడిక తొలగించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పారిశుధ్య సమస్యలపై అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు. నీటి వృధాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీటీసీ మనోహర్, నాయకులు బర్ల మధు, పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్ పాల్గొన్నారు.


ఇందల్వాయిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

● గ్రామాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

నవీపేట: మండలంలోని పలు గ్రామాలలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 7నుంచి 14వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. పలుచోట్ల రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేశారు. పొతంగల్, నవీపేట, రాంపూర్, నాగేపూర్‌లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణలు పరిశీలించారు.

● పారిశుధ్య పనుల పరిశీలన

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలో బుధవారం చేపట్టిన పారిశుధ్య పనులను గ్రామ ప్రత్యేక అధికారి ఎంపిఓ సుభాష్ చంద్రబోస్ పరిశీలించారు. గ్రామ కూడల్లలో, రోడ్లపై చెత్త వేస్తున్న గ్రామస్థులతో ఆయన మాట్లాడి చెత్తను రోడ్డుపై వేయవద్దని, చెత్త ట్రాక్టర్ వచ్చినపుడే అందులో వేయాలని సూచించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ జూనియర్ అసిస్టెంట్ దత్తు, ఫీల్డ్ అసిస్టెంట్ సుచరిత తదితరులు ఉన్నారు.

● ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు

రుద్రూరు: ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంతో పాటు అక్బర్‌నగర్, వివిధ గ్రామాలలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమాలలో వివిధ గ్రామాలలోని ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి త్యాగం ఎంతో గొప్పది



చిత్రపటానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు



నినాదాలు చేస్తున్న నాయకులు

పెద్దబజార్, ఫిబ్రవరి7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి చేసిన త్యాగం ఎంతో గొప్పదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి 126వ జయంతిని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రమాబాయి అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సాధించిన ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్, సందీప్‌కుమార్, రాజేశ్వర్, జిల్లా నాయకులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

● మాల మహానాడు ఆధ్వర్యంలో..

సుభాష్‌నగర్: రమాబాయి జయంతిని జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అధ్యక్షతన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రమాబాయి చేసిన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వినయ్, ఉపాధ్యక్షులు కిష్టయ్య, నాగారావు, గంగాధర్, అశోక్, దయానంద్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం 126 రమాబాయి అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అర్గుల్ చిన్నయ్య రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. రమాబాయి అడుగుజాడల్లో నడవాలని, ఆమె చేసిన సేవలను కళాశాల విద్యార్థులకు ఆయన వివరించారు.

సాలూర: భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని భీమ్ సైనిక్ నాయకులు అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని ఖండ్‌గాం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ 126వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమ్ సైనిక్ నాయకులు మీసాల నగేష్, గ్రామ స్థులు పాల్గొన్నారు.

'సీఎంను విమర్శించే హక్కు ఎమ్మెల్యేకు లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి7: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నేరవేర్చని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదని డీసీసీ డెలిగెట్ తక్కూరి దేవేందర్ అన్నారు. బుధవారం మండలంలోని ఉప్లూర్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడెకరాల వ్యవసాయ భూమి, ప్రతీ గ్రామంలో డబుల్‌బెడ్‌రూంలు, రైతులకు ఏకకాలంలో రుణమాఫీ హామీలతో పదేళ్ల కాలాన్ని వెల్లదీశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అధికారం అప్పగిస్తే ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకోక్కటిగా అమలుపరుస్తున్న విషయం రాష్ట్ర ప్రలకు తెలవందికాదన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు రవీందర్, జిల్లానాయకుడు బోనగిరి లక్ష్మణ్, నరేష్, తదితరులున్నారు.

'సీఎంపై అనుచిత వ్యాఖ్యలు తగవు'

డిచ్‌పల్లి, ఫిబ్రవరి7: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు దళితుడు అని పేరు చెప్పుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పుతో నిరసన తెలపడం బాల్కసుమన్ అవివేకానికి నిదర్శనమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ అన్నారు. బుధవారం మండలంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద కాంగ్రెస్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీవర్గానికి చెందిన అధ్యక్షులతో కలిసి బాల్క సుమన్ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే సుమన్‌పై కేసునమోదు చేయాలని డిచ్‌పల్లి ఎస్సై మహేశ్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, కేసీఆర్, కవిత, హరీశ్‌రావుల ఆస్తులకు బాల్కసుమన్ బినామీ అని, వారి మెప్పు కోసం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు వాసుబాబు, ధర్మగౌడ్, మురళి, ఇబ్రహీం, భాస్కర్, సాయిరెడ్డి, దత్తద్రి, ఏగొండ, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాల్క సుమన్ వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

టీయూ రిజిస్ట్రార్ దిష్టిబొమ్మ దహనం



టీయూలో రిజిస్ట్రార్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి7: తెలంగాణ యూనివర్సిటీ వసతిగృహాల మెస్‌లలో జరిగిన అవకతవకల్లో నిజనిర్ధారణ చేయించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నా టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల వద్ద రిజిస్ట్రార్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు సాగర్ నాయక్, మహేశ్ మాట్లాడుతూ గత వారంరోజులుగా వర్సిటీ హాస్టల్‌లలో జరుగుతున్న ఆర్థిక అవకతవకలపై రిజిస్ట్రార్ నామమాత్రపు కమిటీలు వేస్తు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ఆరోపించారు. ఏర్పాటు చేసిన కమిటీల్లో కూడా పాలన వ్యవస్థ విద్యార్థులపై వివక్షత చూపడం జరిగిందని, వీటన్నింటిపై మౌనంగా ఉండి రిజిస్ట్రార్ స్పందించకపోవడం బాధకరమన్నారు. వర్సిటీలో ఉన్న యంత్రంగం విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూళ్లు చేస్తు గ్రామీణ విద్యార్థులకు విద్యాను దూరం చేస్తున్నారని వారు ఆరోపించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్‌తోపాటు పాలక మండలి హాస్టల్ డిపాజిట్ బిల్లులో ఎస్సీ, ఎస్టీలకు 7వేలు, బీసీలకు 8వేలు, ఓసీలకు 12వేలు ఉండేందని అటువంటి రిజర్వేషన్లు అమలు చేయకుండా అందరి వద్ద రూ.10వేలు డిపాజిట్ చేయించడం సరైంది కాదన్నారు. రిజిస్ట్రార్ విద్యార్థుల పక్షన నిలబడి మేలు చేయాలే గానీ లేదంటే రిజిస్ట్రార్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అభినయ్, రాము, రవి, బాలాజీ, పావని, పవిత్ర, దివ్య, నందిని, రుచిత, క్రాంతి, పాల్గొన్నారు.

రేపు నగరంలో జాబ్‌మేళా

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి7: నగరంలోని నామ్‌దేవ్‌వాడలో గల వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈనెల 9 టైమ్స్ ప్రో కంపెనీ ఆధ్వర్యంలో ఐసీఐసీఐ, యూనిటీయాక్సిస్ బ్యాంకు, ఫ్లిప్కార్ట్ బ్యాంకుల్లో వివిధ రకాల ఉద్యోగాల కోసం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ అధికారి రవీందర్‌రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరైయ్యే అభ్యర్థుల వయసు 26 సంవత్సరాల లోపు ఉండాలని, డిగ్రీ ఉత్తీర్ణులైన వారే హాజరు కావాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డ్, ఫొటోతో ఉదయం 10గంటల నుంచి హాజరు కావాలని సూచించారు. మరిన్నివివరాలకు 9000582809 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

పసుపు పంట దిగుబడిపై వివరాల సేకరణ



పసుపు దిగుబడిని పరిశీలిస్తున్న అధికారులు

ముప్కాల్, ఫిబ్రవరి 7: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామంలో పసుపు పంట దిగుబడిపై బుధవారం రాష్ట్ర ఆర్థిక గణంకల శాఖ ఉపగణంకాల అధికారి కవిత వివరాలు సేకరించారు. గ్రామంలో రైతుకు చెందిన కోతకు వచ్చిన పసుపు పంట 5/5 లీటర్లలో పసుపు పోసి ఎంత దిగుబడి వచ్చిందో తెలుసుకున్నామన్నారు. మండలంలోని మొత్తం ఎన్ని ఎకరాల్లో పసుపు పంట ఉందో, ఎంత దిగుబడి వచ్చింది అనే గణంకాలను తీసుకున్నట్లు వెల్లడించారు. జిల్లా గణంకల అధికారి రతన్‌తో కలిసి గ్రామంలో పసుపు పంట కోత ప్రయోజనాలను నిర్వహించి పసుపు పంట దిగుబడులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గణంకాల అధికారి అన్నపూర్ణ, బాల్కొండ మండల గణంకల అధికారి గంగామోహన్, రెవెన్యూ సహయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ముప్కాల్, ఫిబ్రవరి7: బాల్కొండలోని బోదేపల్లి గ్రామంలో బుధవారం వరి పంటలను పరిశీలించి తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాట్లు వేసి 15 నుంచి 25 రోజుల వ్యవధిలో మొగి పురుగు, కాండం తొలచుపురుగు నివారణకు కార్బపు హైడ్రాక్లోరైడ్ ప్లస్ ఇమామెక్టిన్ బెంజయిట్ మూడు కిలోలు, క్లోరాంత్ర నిలిప్రోల్ గుళికలు నాలుగు కిలోలు ఏదేని ఒకదానిని చల్లుకోవాలి. వరి పైరు 40 నుంచి 60 రోజుల మధ్యలో మొగిపురుగు, కాండం తొలచుపురుగు నివారణకు కార్బపు హైడ్రాక్లోరైడ్ 400 గ్రాములు, క్లోరాంత్ర నిలిప్రోల్ 60ఎంఎల్ 200లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలని వివరించారు. కిలోలు ఏదేని యాసంగి వరిలో అగ్గితెగులు వచ్చే అస్కారం ఉంటుందని, వెంటనే ట్రైసైక్లోజోల్ 120గ్రాములు, ఐసోప్రోథయోలిన్ 300 ఎంఎల్‌లు 200 లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రీకాంత్‌యాదవ్, ఏఈవో నిరహకి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న విద్యుత్ అధికారులు

గృహజ్యోతిని వినియోగించుకోవాలి

సిరికొండ, ఫిబ్రవరి7: ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీ ఉత్తమ్‌జాడే రమేశ్, ఏఈ చంద్రశేఖర్ కోరారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందజేస్తుందని, దానికోసం ఆధార్, రేషన్ లింక్‌లు చేయించుకోవాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్‌శాఖ సిబ్బంది ప్రత్యేకంగా ఇంటింటికీ తిరుగుతూ ఈ ప్రక్రియ చేస్తున్నారని, వినియోగదారులు సహకరించాలని ఏడీ కోరారు. విద్యుత్ అధికారులు ఇంటింటికి వెళ్లి చేపడుతున్న ఈ సర్వేను ఏడీ సిరికొండలో పరిశీలించారు.

● ఆలూర్‌లో 200 యూనిట్లలోపు వివరాల సేకరణ

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం విద్యుత్‌శాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి 200 యూనిట్ల లోపు విద్యుత్ యూనిట్లు ఖర్చు చేసే వివరాలను సేకరించారు. ఈనెల 15వ తేదీలోపు అధికారులు ఇంటింటికీ తిరుగుతూ నమోదు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌లను అధికారులు సేకరిస్తున్నారు.

● ఉచిత విద్యుత్‌పై డాటా ఎంట్రీ

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని ఉచిత విద్యుత్‌పై డాటాఎంట్రీ విద్యుత్ అధికారులు చేపట్టారు. 200 యూనిట్లు ఉచిత విద్యుత్ కోసం బుధవారం పట్టణంలోని పలు కాలనీలో ఇంటింటికీ తిరిగి వినియోగదారుల నుంచి ఆధార్‌కార్డు, రేషన్‌కార్డును వివరాలను సేకరించి డాటీ ఎంట్రీ చేస్తున్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏడీఈ శ్రీధర్, లైన్‌మెన్ సంతోష్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రజొన్న రైతులు అప్రమత్తంగా ఉండాలి

● కాంగ్రెస్ కిసాన్‌సెల్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి7: జిల్లాలో ఎర్రజొన్న సాగుచేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని, మార్కెట్ లేదని, ధర లేదని వ్యాపారులు కల్లిబొల్లి మాటలు చెప్పి ధర తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్‌సెల్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనల విడుదల చేశారు. రూ.4200 ధర మొదట్లో ఇచ్చి ఇప్పుడు రూ.3800కి తగ్గించడం రైతులను దగా చేయడమేనని, వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను మోసం చేయాలని చూస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఈ సందర్భంగా హెచ్చరించారు. రైతుల పక్షాన ప్రభుత్వం నిలబడుతుందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను గమనించి ధరతగ్గించి కొనుగోలు చేసే పనిని మానుకోవాలని, కొందరు వ్యాపారస్తులు చెప్పిందే ధరగా శాసిస్తూ ధరలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని, ఈ పద్ధతిని మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా ఇలాంటి వారిపై కచ్చితంగా చర్యలుతీసుకుంటుందని, రైతులు తొందరపడి వ్యాపారుల మాటలు నమ్మి వారు అడిగిన ధరకు ఎర్రజొన్నలను ఇవ్వవద్దని, 3నెలలు కష్టపడి పండించిన పంటను మూడురోజులకే అమ్ముకుంటే నష్టపోతామని పేర్కొన్నారు. రైతులంతా ఐక్యంగా ఉంటే ధర ఎలా రాదో చూస్తామని, వ్యాపారుల ఉచ్చులో పడొద్దని ఆయన రైతులను కోరారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సీపీ

ఖిల్లా, ఫిబ్రవరి7: నకిలీ గల్ఫ్ ఏజెంట్ల పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని సీపీ కల్మేశ్వర్‌శింగేనవార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గల్ఫ్ ఏజెంట్లు ఉపాధి కల్పన సంస్థలతోపాటు ట్రావెల్స్, టూరిస్టు సర్వీస్‌ల పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, వారి పట్ల నిరుద్యోగులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఇలాంటి సంస్థలను నడుపుతున్నట్లైతే వారు ఇలాంటి వ్యాపారాలు మానుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇలాంటి వారు తమ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్లైతే దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

నవీపేట, ఫిబ్రవరి7: నవీపేట, నిజామాబాద్ సౌత్ రూరల్ పోలీస్ స్టేషన్‌లలో పని చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్‌కు గురైనట్లు తెలిసింది. సంబంధిత కానిస్టేబుళ్లు ఇటీవల ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పలువురితో కలిసి గోవా టూర్‌కు వెళ్లినట్లు సమాచారం. నవీపేట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ గతనెల 23 నుంచి 26వ తేదీవరకు తన తండ్రికి అనారోగ్యం ఉందని చెప్పి సెలవు పెట్టి గోవాటూర్‌కు వెళ్లినట్లు తెలిసింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు వారిని సస్పెన్షన్ చేసినట్లు తెలిసింది.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మత్తు పదార్థాలను అరికట్టడంలో ఉద్యోగుల పాత్ర కీలకం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి7: మత్తు, నిషేధిత పదార్థాలను అరికట్టడంలో ఎక్సైజ్ ఉద్యోగుల పాత్ర కీలకమైందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ అన్నారు. నగరంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల అసోసియేషన్ క్యాలెండర్, డైరీని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలతో యువత తమ జీవితాన్ని నాశనం చేసుకుంటోందని, జిల్లాలోకి మత్తుపదార్థాలను రానివ్వకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి, నిషేధిత పదార్థాలు జిల్లాలోకి రాకుండా చర్యలు చేపడతున్నామన్నారు. రైళ్లు, బస్సుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగులు సైతం శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ కిషన్, ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుళ్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, సీఐ దీపక్, సభ్యులు పాల్గొన్నారు.

కల్లు గుడిసెకు నిప్పు.. రూ.లక్ష ఆస్తినష్టం

మోపాల్, ఫిబ్రవరి7: మండలంలోని ముదక్‌పల్లిలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు రాజగౌడ్‌కు చెందిన కల్లు బట్టికి నిప్పుపెట్టారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశారు. అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో గుడిసె సమీపంలో ఉన్న స్థానికులు చూసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసి రాజగౌడ్‌కు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు కల్లుబట్టికి చేరుకునేలోపే గుడిసే కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. సుమారు రూ.లక్ష విలువగల వస్తువులు కాలిపోయాయని బాధితుడు పేర్కొన్నాడు.

'బంజారాలకు ఎంపీ టికెట్లు కేటాయించాలి'

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి6: త్వరలో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో అధిక ఎంపీ టికెట్లు బంజారాలకు కేటాయించాలని లంబాడా హక్కుల పోరాటసమితి, గిరిజన సంఘాల నాయకులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపదాసుమున్షిని కలిసి నాయకులు కలిసి విన్నవించారు. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్‌లను రాష్ట్రంలో బంజారాలకు ఇవ్వాలని కలిసి కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కృషిచేసిన బెలాయ్‌నాయక్, తేజవత్‌కు మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ఆర్మూర్ మున్సిపల్ అవినీతిపై ఇన్‌చార్జి మంత్రి విచారణకు ఆదేశించాలి'

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి7: గత నాలుగేళ్లుగా మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు విచారణకు ఆదేశించాలని బీజేపీ ఫ్లోర్‌లీడర్ జీవీ.నర్సింహరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీ పాలెపు రాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా అక్రమ లేఅవుట్లు, అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ భూములకు ఇంటి నెంబర్‌లు, దొంగ బిల్లులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్‌లోని 36మంది కౌన్సిలర్‌లకు అవిశ్వాసం నోటీసులు అందజేసి అవిశ్వాస పరీక్షలో 24మంది కౌన్సిలర్‌లు ఓటు వేయగా అవిశ్వాసం నెగ్గిందని, ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ ప్రకటించారని, ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని ఓటరుగా పరిగణించలేదని, నోటీసు కూడా ఇవ్వలేదని అన్నారు. తక్షణమే ప్రభుత్వం జిల్లా కలెక్టర్, ఆర్డీవోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్, దోండి ప్రకాష్, పులి యుగంధర్, ఉదయ్‌గౌడ్, బాశెట్టి రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అడవి మృగాల వేటలో పది మేకలు మృతి



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న అధికారులు

ఇందల్‌వాయి, ఫిబ్రవరి7: మండలంలోని మేగ్యానాయక్‌తండాలో లకావత్ గోపికి చెందిన మేకల మంద మంగళవారం రాత్రి దారితప్పి అటవీ ప్రాంతంలోనే ఉండిపోగా వాటిపై అడవీ మృగాలు దాడి చేయడంతో పది మేకలు మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. మొత్తం మేకల మంద నుంచి పది మేకలు మృతిచెందాయని అందులో ఏడు మేకల కళేబరాలు లభించగా మిగతా మూడు మేకలు కనిపించలేదని తెలిపారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అటవీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మేకల మందపై చిరుత లేక ఇతర అడవి మృగాలు దాడి చేసి ఉంటాయని చెప్పారు. మేకల యజమాని లకావత్‌గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించినవారిలో అటవీశాఖ సిబ్బంది రంజిత్, పవన్, వెటర్నరీ డాక్టర్ గంగాప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మగ్గిడిలో పల్లెకుపోదాం అభియాన్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి7: మండలంలోని మగ్గిడి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ ప్రవాసిగా హాజరయ్యారు. యువకులు, రైతులతో కలిసి గ్రామంలో పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగితెలుసుకున్నారు. పిప్రి, ఖానాపూర్, మగ్గిడి రోడ్డును బాగు చేయించాలని పలువురు కోరారు. ప్రాథమిక పాఠశాలలో 120 మంది విద్యార్థులకు గాను ప్రపంచ ఉపాధ్యాయుడు ఒక్కరే ఉన్నారని విద్యవాలంటీర్‌లతో పాఠాలు బోధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడిని నియామించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ కార్యదర్శి బాబురావు, రాజేంద్ర, శివరాజ్, రంజిత్‌కుమార్, మహేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలి'

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి7: మారుతూ వస్తున్న పరిస్థితులకు అనుగుణంగా కమ్యూనిస్టు విప్లవకారులంతా తమ పంథా కార్యక్రమాలను మార్చుకోవాల్సిన అవసరం వచ్చిందని, విప్లవ పార్టీలు విప్లవోద్యమమే ఏకైక ఎజెండాగా ఐక్యమవుతున్నాయని, దేశవ్యాప్తంగా ఒకే అతి పెద్ద విప్లవ పార్టీగా మారనున్నట్లు మాస్‌లైన్ (ప్రజాపంథ) రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని హసాకొత్తూర్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో ప్రజాతంత్ర సోషలిస్టు విప్లవమే మాస్‌లైన్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇందులో భాగంగానే విప్లవపార్టీలు ఐక్యమై మార్చ్ 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో వేల మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభనిర్వహిస్తున్నట్లు ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రధాని మోదీ దేశంలో నియంతృత్వపాలన సాగిస్తున్నారని కేవలం రాముడి పేరుతో రామజపంతో ఈ పాలన సాగిస్తు దేశాన్ని వెనక్కి తీసుకెళ్తూ అదానీ, అంబానీలకు అప్పగిస్తు పాలన సాగిస్తున్నరని ఆరోపించారు. సమావేశంలో నాయకులు సురేష్, జికిషన్, సత్తెక్క, కమ్మర్‌పల్లి కార్యదర్శి అశోక్, నాయకులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,150	రూ.59,150	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (12.20, 6.50)
: ఫైటర్ (హిందీ 3డీ) (3.15, 9.45)
స్క్రీన్-2 : ఫైటర్ (హిందీ 3డీ) (11.45)
: హనుమాన్ (తెలుగు) (3.20, 6.40, 10.00)
స్క్రీన్-3 : యాత్ర-2 (10.30, 1.25, 4.20, 7.15, 10.10)
స్క్రీన్-4 : కెమెరామెన్‌గంగతో రాంబాబు (12.25, 6.45)
: అర్గిలి (ఇంగ్లీష్) (3.40)
: అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్ (10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.25, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-1 : యాత్ర-2 (1.20, 4.20, 7.30, 10.30)
స్క్రీన్-3 : హనుమాన్ (1.30,4.30, 7.30,10.30)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కెమెరామెన్ గంగతో రాంబాబు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 6.15), యాత్ర-2 (2.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్